# 'నా ప్రేమయే మీకు సౌభాగ్యం'

ప్రేమస్వరూపులారా! ఏ మానవుడు తనయందున్న ఆత్మ, పరుల యందున్న ఆత్మ ఒక్కటేయని విశ్వసించునో అట్టివాడు గృహస్థుడైనా, రక్తుడైనా, విరక్తుడైనా భగవంతుడు అతనియందు నివాసియై ఉంటాడు. అతనే భగవంతునిగా మారతాడు. భగవంతుని తత్త్వమును గుర్తించలేక అనేకమంది విమర్శిస్తుంటారు. అయితే అర్థం చేసుకున్నవారు అదృష్టవంతులు. భగవంతుడు సత్యమునందు, అసత్యమునందు, ధర్మమునందు, అధర్మమునందు, పుణ్యమునందు, పాపమునందు సమత్వంగా ఉంటున్నాడు. ఇట్టి పవిత్రమైన ఏకత్వమును గుర్తించే నిమిత్తం ప్రాచీన ఋషులు అనేక విధములుగా ప్రయత్నించారు, ఎన్నో పరిశోధనలు సల్పారు. కడపటికి 'వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" (అజ్ఞానము అనే తమస్సుకు ఆవల కోటి సూర్యుల మేటి కాంతితో ప్రకాశిస్తున్న భగవంతుణ్ణి మేము చూశాము) అని ప్రపంచానికి చాటుతూ వచ్చారు.

మానవత్వంలోనున్న దివ్యత్వాన్ని ప్రాకృత అనుభూతులయందు మనం అవగాహన చేసుకోవచ్చును. అవి దైవత్వమును ప్రత్యక్షంగా చూపించక పోయినప్పటికీ దైవత్వముయొక్క ఉనికిని నిరూపిస్తాయి. కొద్దిసేపటి క్రిందట మీరు 'లయన్ డ్యాన్స్' (సింహనృత్యం) చూశారు. అవినిజమైన సింహములు కావు. కాని వాటిద్వారా నిజమైన సింహము ఎలా ఉంటుందో గుర్తించటానికి సాధ్యమవుతుంది. అదేవిధంగా ఈ ప్రపంచమునందున్న ప్రతి ప్రదార్థమూ, ప్రతి అనుభూతీ దివ్యత్వమును గుర్తింపజేస్తుంది. చెఱకు లోని తీపి, మిరపలోని కారము, చింతలోని పులుపు, వేపలోని చేదు – ఇవన్నీ దైవత్వంయొక్క ఉనికిని గుర్తింపజేసే చిహ్నములే. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు చల్లదనాన్ని అందిస్తున్నాడు. నక్షత్రాలు వెలుగుతున్నాయి, తరంగాలు కదులుతున్నాయి. ఇవన్నీ భగవత్తత్త్వమునకు నిదర్శనములే. ఇవి భగవంతుణ్ణి చూపించక పోయినప్పటికీ భగవత్తత్త్వమును నిరూపిస్తున్నాయి.

**సృష్టి, స్థితి, లయములు దైవాధీనములు**

ఈ జగత్తంతయు సృష్టి, స్థితి, లయములనే మూడు విధములైన కర్మలతో కూడియున్నది. ఈ సత్యమును ఎవ్వరూ, ఏ సైంటిస్టుకూడా కాదని చెప్పలేదు. జగత్తులో ఇది నిత్యమూ

sri sathyasaivachanamrutam

మనకు కనిపిస్తూనే ఉన్నది. సృష్టింపబడినది పోషింపబడుతున్నది. పోషింపబడినది లయం గావింపబడుతున్నది. ఇది ప్రత్యక్ష ప్రమాణము. ఈ మూడు విధములైన కర్మలను చక్కగా విచారణ చేసినప్పుడు దివ్యత్వము మనకు గోచరమౌతుంది. ప్రాకృతమైన వ్యవహారములలో విద్యాశాఖకు ఒక మంత్రి ఉంటాడు. రెవెన్యూశాఖకు ఒక మంత్రి ఉంటాడు, పోలీసుశాఖకు ఒక మంత్రి ఉంటాడు. అయితే వీరందరూ ప్రధానమంత్రికి ఆధీనులై ఉంటారు. అదేరీతిగా, సృష్టికి అధిపతి బ్రహ్మ అనియు, రక్షణకు అధిపతి విష్ణువు అనియు, శిక్షణకు అధిపతి శివుడనియు వేరువేరు పేర్లతో కర్మలను ఆచరిస్తూ ఉన్నప్పటికీ, ఈ మూడింటికీ అధిపతి దైవమే. అతనినే మహమ్మదీయులు 'అల్లా' అన్నారు. విదేశీయులు God అన్నారు. G అనగా Generation (సృష్టి), O - అనగా Organisation (పోషణ), D - అనగా Destruction (లయము), కనుక god అనే పదములోనే సృష్టి, స్థితి, లయములు చేరి ఉంటున్నాయి. ఇలాంటి లౌకికమైన ఆధారములు తీసుకొని దివ్యత్వము యొక్క ఉనికిని నిరూపించవచ్చును. ఒకరు చెప్పినా, చెప్పకపోయినా సత్యము సత్యమే. దైవము ఉన్నాడు. ఎక్కడున్నాడు? సర్వులయందున్నాడు. సర్వస్వరూపుడై ఉన్నాడు. మానవత్వంలోని దివ్యత్వం సర్వులకు గోచరమౌతూనే ఉన్నది. ఈనాడిన్ని లక్షలమంది స్వామిపట్ల ప్రేమతో ఇక్కడికి వచ్చారు. ఈ ప్రేమయే దివ్యత్వమునకు ప్రధానమైన చిహ్నము. ఇందరు తమ ప్రేమను స్వామియందు నిల్పుకుంటున్నారు. ఇంతకంటే ఆనందం మరొకటి లేదు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు నేను మీకు ఏమి చెప్పగలను? ఈ దృశ్యమును చూస్తుంటే నా హృదయం ఆనందంతో నిండిపోతున్నది. ఇందరి ప్రేమకు పాత్రుడనైన నా ఆనందమునకు హద్దు లేదు. మిమ్మల్ని నేను ఆహ్వానించలేదు. నా యందున్న ప్రేమయే మిమ్మల్ని ఆహ్వానించింది. ప్రేమయే నేనందించే ప్రధానమైన సందేశము. మీరందరూ క్షేమంగా ఉండాలి. ఆనందంగా ఉండాలి, ఆధ్యాత్మిక తత్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి. జగత్తును ఉద్ధరించాలి. అందరియందున్న దైవత్వం ఒక్కటే అన్న భావంతో జీవితాన్ని గడపాలి.

**కర్మకు తగిన ఫలితం తప్పదు**

ప్రేమస్వరూపులారా! ఇతరులు మనలను ప్రేమించాలంటే, గౌరవించాలంటే మొట్టమొదట మనం ఇతరులను ప్రేమించాలి, గౌరవించాలి. మానవజీవితమంతయు 'రిఫ్లెక్షన్, రియాక్షన్,



sri sathyasai vahini amrutham

రీసౌండ్' లతో కూడినది. కనుక మనం అందరినీ ప్రేమించాలి. అప్పుడే మనం అందరి ప్రేమకు పాత్రుల మౌతాము. అందరినీ మనం గౌరవించాలి. అప్పుడే అందరూ మనలను గౌరవిస్తారు. ఇతరులు మనకు ఏది చేయాలని ఆశిస్తున్నామో మొట్టమొదట దానిని మనం ఆచరించాలి. ప్రభుత్వము వారు కొంతమంది పోలీసువారిని, కొంతమంది మిలటరీవారిని నియమిస్తారు. దేనికోసం? దేశాన్ని కాపాడే నిమిత్తం. దోషము చేసినవారిని పోలీసులు శిక్షిస్తారు. దోషమే చేయకుండిన పోలీసులు శిక్షించటానికే వీలులేదు. అదేవిధంగా మంచి చేసినవారికి మంచి ఫలితము నందించటానికి, చెడ్డ చేసినవారికి చెడ్డ ఫలితము నందించటానికి భగవంతుడు కొన్ని శక్తులను నియమించాడు. కాని ఈ సత్యాన్ని గుర్తించుకోలేక కొందరు భగవంతుణ్ణి దూషిస్తుంటారు. చాలా పొరపాటు. ముందు మీరు దుష్కర్మలకు దూరంగా ఉండండి. దుర్భావాలను దూరం చేసుకోండి. అప్పుడు ఎవ్వరూ మిమ్మల్ని శిక్షించరు; శిక్షించే వ్యక్తులుకూడా వచ్చి రక్షిస్తారు.

**నిన్ను నీవు తెలుసుకో**

మానవుడంటే ఆత్మస్వరూపుడని చెప్పాను; ఆత్మ శాశ్వతమైనదనికూడా చెప్పాను. వేదాంతము "నిన్ను నీవు తెలుసుకో" అని బోధించింది. ఈనాటి మానవుడు ఇతరులను "నీవెవరు?" అని ప్రశ్నిస్తున్నాడేగాని, "నేనెవరు?" అని తనను తాను ప్రశ్నించుకోవటం లేదు. తన రూపనామములను పురస్కరించుకొని తాను ఫలానావాడనని అంటున్నాడు; తన దేశమును పురస్కరించుకొని తాను ఫలానా దేశీయుడనని చెబుతున్నాడు. తన వృత్తిని పురస్కరించుకొని తాను ఫలానా పనిచేసేవాడినని చెబుతున్నాడు. కాని, ఇవేవీ సరియైన జవాబులు కావు. "నీవెవరు?" అన్న ప్రశ్నకు "నేను ఆత్మను" అన్నదే సరియైన జవాబు. దేహము, మనస్సు అనిత్యమైనవి. వాటిని నీవుగా భావించుకోవటం పొరపాటు. మనోదేహములకు శక్తినిచ్చే ఆత్మతత్త్వమే నీవని గుర్తించాలి. ప్రతి వ్యక్తీ ఆత్మస్వరూపుడేగాని, అన్యస్వరూపుడు కాదు. అతని స్వరూపమే సర్వత్రా వ్యాపించి ఉన్నది. సర్వత్రా వ్యాపించిన Cosmic Power అది. దానిని గుర్తించుటకు మీరు ప్రయత్నించాలి. అది ఎంతో కష్టమని మీరు భావిస్తున్నారు. కాని దానికంటే సులభమైనది మరొకటి లేదు. మీరు దేహాభిమానమును పెంచుకోవటంచేతనే అది మీకు కష్టమనిపిస్తున్నది.

srisathyasaivachanamrutam

## ప్రపంచం ఒక అద్దాల గదివంటిది

"సర్వ భూత నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" అన్నారు. ఎవరికి నమస్కరించినా దైవానికే నమస్కరించినట్లవుతుంది. ఎందుకంటే సర్వుల యందు దైవత్వం ఉన్నది. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అన్నాడు కృష్ణుడు. ఒక అద్దాల గదిలో ఒక తెలివితక్కువ పక్షి ప్రవేశించింది. తన చుట్టూ ఉన్న అద్దాలలో ప్రతిబింబిస్తున్న తన రూపాన్ని చూసి, అవి తన శత్రువులేమో, తనను బాధిస్తాయేమోనన్న భావంతో క్రోధమును పూని ఆ అద్దాలను కొట్టి కొట్టి ముక్కలు చేసింది. అవి ఎన్ని ముక్కలు అయినాయో అన్ని ప్రతిబింబములు కనిపించసాగాయి. దానితో ఆ పక్షి మరింత రెచ్చిపోయింది. ఇది అజ్ఞానముయొక్క ప్రభావం. అదే అద్దాల గదిలో ప్రజ్ఞానవంతుడైన మానవుడు ప్రవేశిస్తే, తన చుట్టూ కనిపించేవన్నీ తన ప్రతిబింబములే కదా అని ఆనందిస్తాడు. తనలోని దోషాలను నిర్మూలించు కుంటాడు. అన్నీ ప్రతిబింబములే అన్న సత్యాన్ని గుర్తించి వర్తించేవాడే నిజమైన మానవుడు. రూపనామములందు, శక్తులందు మీకు భిన్నత్వం గోచరించవచ్చు కాని, "నీవు నేను ఒక్కటే" అనే సత్యాన్ని గుర్తించడమే నిజమైన జ్ఞానము. దైవం మందిరమునందు, మసీదునందు, దర్గాలయందు ప్రత్యేకంగా లేడు, మీయందే ఉన్నాడు. మీయందున్న దివ్యత్వమునే దర్గాకి వెళ్ళినప్పుడు దర్శిస్తున్నారు. మందిరములకు వెళ్ళినప్పుడు కూడా మిమ్మల్నే మీరు దర్శించుకుంటున్నారు. మీరు ఏ సాధనలు చేసినప్పటికీ మీయందున్న సత్యాన్ని మీరు గుర్తించుకునేటందులకే!

## సృష్టి అంతా ఏకత్వమే, దృష్టిలోనే ఉంది భిన్నత్వం

ప్రతిమానవునికి జనన, మరణాలుంటున్నాయి; రెండింటికీ మధ్య జీవితమున్నది. అది తరుగుతుంది, పెరుగుతుంది. కాని, మానవత్వం పెరిగేది కాదు, తరిగేది కాదు. దేహము పెరుగుతుంది కాని, తాను పెరగటం లేదు. తరగటం లేదు. చిన్నతనమునందు అతనిని ...ఃనీరిజిఖి అన్నారు; యౌవనంలో Man అన్నారు; వార్ధక్యమునందు Grand father అన్నారు. రూపము మారుతున్నదిగాని, మనిషి ఒక్కడే కదా! అదేవిధంగా మనకు కనిపించే రూపనామములు వేరు కావచ్చుగాని, దైవశక్తి ఒక్కటే. ఈ సత్యాన్ని మీరు గుర్తించి అందరినీ ప్రేమిస్తే మీరే దైవంగా మారిపోతారు. అందరియందున్న దైవత్వం ఒక్కటే అని గుర్తించినప్పుడు మీకు ఎలాంటి భేదములూ ఉండవు. గుర్తించుకోలేకపోవటం మీ దృష్టిదోషమే గాని, సృష్టిదోషం

కాదు. మీ దృష్టిదోషాన్ని మీరు సవరించుకోకుండా సృష్టిలో దోషాలను వెతుకుతున్నారు. సృష్టిలో ఎలాంటి దోషమూ లేదు. సృష్టిలో సర్వమూ ఏకత్వంగానే ఉన్నది; మీ దృష్టిలోనే ఉన్నది భిన్నత్వం.

**ఆత్మవిశ్వాసం గలవారికి అన్నింటిలోనూ విజయమే**

ప్రతి మానవునికి ఆత్మవిశ్వాసం అత్యవసరం. ఆత్మవిశ్వాసంతో ఏ కార్యంలో ప్రవేశించినా తప్పక విజయాన్ని సాధిస్తారు. అమెరికాలో అతి బీద కుటుంబంలో పుట్టాడు లింకన్. తండ్రి వడ్రంగి పని చేసేవాడు. తల్లి పాత గుడ్డలను కుట్టి తద్వారా వచ్చిన డబ్బుతో అబ్బాయిని పోషించుకుంటూ వచ్చింది. ఈ పిల్లవాడు షాహుకారు బిడ్డలతో కలిసి స్కూలుకి వెళ్ళేవాడు. వారంతా ఇతని డ్రస్సును చూసి హేళన చేసేవారు. చిన్నపిల్లవాడైన లింకన్ ఒకనాడు ఏడుస్తూ తల్లి దగ్గరకువచ్చి "అమ్మా! నా తోటిపిల్లలు నన్ను అవమానం చేస్తున్నారు. నాకు మంచి డ్రస్సులు కుట్టించు" అన్నాడు. అప్పుడు తల్లి అతనిని దగ్గరకు చేరదీసి "నాయనా! మొట్టమొదట నీవు మన కుటుంబముయొక్క పరిస్థితిని గుర్తించు. మనం చాలా బీదవారము. తినటానికే తిండి లేని మనం ఏవిధంగా మంచి గుడ్డలను ధరించటానికి వీలవుతుంది.? నీవు మన స్థితికి తగిన గతిని అనుసరించాలి. ఇతరులు నిన్ను ఎంత గేలిచేసినా నీవు లెక్క చేయవద్దు. ఆత్మవిశ్వాసంతో జీవించు. ఏనాటికైనా నీవు అభివృద్ధికి వస్తావు" అని బోధించింది.

అప్పటినుండి లింకన్ విశ్వాసమును పెంచుకున్నాడు; కష్టపడి చదివాడు. ఆత్మవిశ్వాసమే తనకు రక్ష అని భావించాడు. అతని వద్ద ధనకనక వస్తువాహనాదులు లేకపోయినప్పటికీ ఆత్మవిశ్వాసమనే ధనము నిండుగా, దండిగా ఉండినది. కొంతకాలానికి తల్లి మరణించింది. కాని ఆమె చేసిన బోధలు అతని హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. తండ్రి రెండవ పెండ్లి చేసుకున్నాడు; ఇది విదేశీయులకు సహజమే. అయితే సవతితల్లికూడా లింకన్ ను చాలా ప్రేమగా చూసుకుంది. ఆమెకూడా "నాయనా! నీ తల్లి చెప్పినట్లుగా నీవు ఆత్మవిశ్వాసంతో జీవించు" అని బోధించేది. కాని క్రమక్రమేణ అతనికి అనేక కష్టాలు ఎదురైనాయి. ఏదైనా ఉద్యోగం చేయాలనుకున్నాడు. కాని, ఉద్యోగం చేయటంకంటే స్వశక్తిపై ఆధారపడటం మంచిదనే ఉద్దేశ్యంతో వ్యాపారం చేస్తూ వచ్చాడు.

sri sathyasai vahini amrutam

ఆ వ్యాపారమును కూడా పూర్తి సత్యమైన మార్గంలో చేశాడు. క్రమక్రమేణ తోటివారు అతనిని మోసం చేశారు. కొందరు మంచిని చూసి ఓర్చలేరు; ఎదుటివారి అభివృద్ధిని చూసి సహించలేరు. ఇది అనాది కాలమునుండి జరుగుతూనే వస్తున్నది. చివరికి లింకన్‌కి వ్యాపారంలో నష్టం వచ్చింది. అతడు ఇతరులకు కొంత డబ్బు ఋణపడినాడు.

అన్నదానముకన్న నధిక దానంబేది?
తల్లిదండ్రులకన్న దైవమేది?
జపతపంబులకన్న సత్యశీలంబేది?
దయకంటె నెక్కువ ధర్మమేది?
సుజన సంతితికన్న చూడ లాభంబేది?
క్రోధంబుకన్న శతృత్వమేది?
ఋణముకంటెను నరునకు రోగమేది?
ధరణి నపకీర్తికంటెను మరణమేది?
సర్వదా కీర్తికంటెను సంపదేది?
సర్మణకంటెను మించు నాభరణమేది?

కనుకనే అతడు తనవద్దనున్న చిన్న చిన్న మిషన్లను అమ్మివేసి ఆ ఋణాన్ని తీర్చివేశాడు. అతని సత్యశీలమును గుర్తించిన కొందరు స్నేహితులు అతనిని ఎలక్షన్లలో పోటీ చేయవలసిందని ప్రోత్సహించారు. అతనికి కావలసిన సహాయం చేస్తామని మాటిచ్చారు. ఆ నమ్మకంపైన లింకన్ ఎలక్షన్లలో పోటీచేసి దిగ్విజయం సాధించాడు. క్రమక్రమేణ అందరూ చేరి అతనిని ప్రెసిడెంట్‌గా చేశారు. ఆ రోజుల్లో అమెరికాలో తెల్లవారు నల్లవారిని బానిసలుగా చేసుకుని చాలా హింసించేవారు. ఇది చూసి లింకన్ చాలా బాధపడ్డాడు. లోకంలో అందరూ సమానులే! అందరూ భగవంతుని బిడ్డలే! కాబట్టి ఇలాంటి భేదములు ఉండకూడదనే ఉద్దేశ్యంతో తాను ప్రెసిడెంటు అయిన తరువాత బానిసత్వాన్ని నిర్మూలిస్తూ చట్టాన్ని అమలు చేశాడు.

**అసూయ వేరుపురుగువంటిది**

ఈ లోకంలో మంచి చెడ్డలకు సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఎవరైనా మంచిపేరుతో అభివృద్ధికి వస్తున్నారంటే వారిపైన అసూయతో కొందరు లేనిపోని అపోహలు కల్పిస్తుంటారు.

sri sathyasai vachanamrutam

అసూయ వేరుపురుగు వంటిది. వేరుపురుగుపైకి కనిపించదుగాని, అది ప్రవేశించిందంటే ఫలపుష్పాదులతో కళకళలాడే వృక్షమైనా కూలిపోక తప్పదు. అదేరీతిగా అసూయ ప్రవేశించిందంటే మనిషికి పతనం తప్పదు. కొందరు తమయందు అసూయను గోప్యంగా పెట్టుకొని దుష్ప్రచారం చేస్తుంటారు. వాటిని మనం ఏమాత్రమూ లెక్కచేయకూడదు. మన భారతదేశంలో ఎందరో మహనీయులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొని విజయాన్ని సాధించారు. సత్యమునకు కట్టుబడినవారికి, ప్రేమతో జీవించేవారికి ఏనాటికీ ముప్పురాదు. దేహము ఏనాటికైనా పోయేటటువంటిదే. దానిని రక్షించుకునే నిమిత్తం పెడమార్గం పట్టరాదు. దేహం పోతుంది గాని, మన సత్యం శాశ్వతంగా నిలుస్తుంది. కాబట్టి సత్యంకోసం పాటుపడాలి.

**దైవాన్ని దూషించేవారు నాల్గు రకాలు**

కొందరు తమ మనోభీష్టములు నెరవేరనప్పుడు దైవానికి విరుద్ధమైన మార్గాన్ని అవలంబిస్తారు. ఇది వారి దోషమే గాని, నా దోషం కాదు. లోకంలో దైవాన్ని దూషించేవారు నాల్గు రకములుగా ఉంటున్నారు. అసలు దేవుడంటేనే నమ్మకం లేనివారు మొదటి రకము. ఇతరులు అభివృద్ధికి రావటం చూసి ఓర్చుకోలేక ద్వేషించేవారు రెండవ రకము. తమ కోరికలు నెరవేరకపోవటంచేత ద్వేషించేవారు మూడవ రకము. "అతనికి వచ్చిన ఉన్నత స్థితి, పేరు ప్రతిష్ఠలు నాకు రాలేదే" అని ఏడ్చేవారు నాల్గవ రకము. ఈ నాల్గు రకములైన వ్యక్తులు తప్ప దైవాన్ని ఎవ్వరూ దూషించరు. కొందరు తుచ్ఛమైన భావంతో ఏదో ఒక అభీష్టమును వ్యక్తం చేశారు. "స్వామి! మీరు నాకీ పనిచేయాలి. నేనొక సొసైటీ పెట్టుకుంటున్నాను. ఒక స్కూలు స్థాపిస్తున్నాను. నాకు ఇంత డబ్బు కావాలి" అని అడుగుతారు. నేను సత్యమే చెబుతాను. "నాయనా! నీదేశం వేరు, ఈ దేశం వేరు. ఈ దేశం డబ్బు నీదేశంలో చెల్లదు. ఈ డబ్బును తీసుకుపోవాలంటే మనం గవర్నమెంటును మోసం చేయాలి. దానిని నేను అంగీకరించను" అంటాను. అలాంటి పరిస్థితిలో వారు నాపైన ద్వేషం పూని, నాకు వ్యతిరేకంగా అనేక రకములుగా ప్రచారం చేస్తారు. ఎవరేమి చేసినా నా సత్యము నాదే. ఎవ్వరు దూషించినా మీరు లెక్కచేయకూడదు. ఎందుకంటే, మీ నమ్మకం మీది. దైవత్వం నమ్మకంపైన ఆధారపడినది. నమ్మకం ఒకరు కల్పించేది కాదు. ఎవరి నమ్మకం వారిది.

sri sathyasai vahanamrutam

అందువల్లనే ఒకానొక సమయంలో త్యాగరాజు చెప్పాడు. "ఓ భగవంతుడా! ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు" ఎవరు ఏవిధమైన భావంతో తలుస్తారో వారికి ఆ విధమైన ఫలితమే ప్రాప్తిస్తుంది. కొందరు దైవం ఉన్నాడంటారు. మరి కొంతమంది లేదంటారు. దైవం ఉన్నాడన్నవారికి ఉన్నాడు. లేదన్నవారికి లేదు.

'యెస్' అనువారికి 'యెస్' అనురా
'నో' అనువారికి 'నో' అనురా
'నో' 'యెస్' లు మీ నోటికెగాని
సాయికి సర్వం 'యెస్, యెస్, యస్'

ఎవరి మనస్సు వారికి సాక్షి. కాబట్టి మీరు ఇతరుల మాటలు నమ్మి మీ నమ్మకమును, ఆత్మతత్త్వమును వదలిపెట్టకూడదు. నా సత్యం ఒక్కటే. అందరూ నావారే. నేను అందరివాడనే. నా ప్రాపర్టీ ప్రేమ ఒక్కటే. ఆ ప్రేమచేతనే నేను అందరినీ ఆదరిస్తుంటాను. నాపై ద్వేషం పూని నన్ను ఆశ్రయించినవారిని కూడా ప్రేమిస్తాను. నా దృష్టిలో దుర్మార్గులే లేరు. ఎందుకంటే వారి చేష్టలు ఈనాడు ఒక విధంగా ఉంటాయి, రేపు మరొకవిధంగా మారతాయి. నేను తప్పొప్పులను వెతకను, వారి ద్వేషాన్ని అంతకంటే చూడను. నా ప్రేమను నేను చూసుకుంటాను. ఇలాంటి 'ప్యూరిటీ' (పవిత్రత) ని మీరు అభివృద్ధి చేసుకున్నప్పుడే మీలో డివినిటీ (దివ్యత్వం) ఆవిర్భవిస్తుంది. 'ప్యూరిటీ' కావాలంటే మీలో 'యూనిటీ' (ఐకమత్యం) ఉండాలి.

**ఐకమత్యం లేని స్వాతంత్ర్యం నిరర్థకం**

ప్రేమస్వరూపులారా! ఈనాడు మన భారత దేశాన్ని సరియైన స్థితిలో తీర్చి దిద్దుకోవాలంటే అందరూ ఐకమత్యంగా ఉండాలి. మన ప్రాచీన నాయకులు అనేక త్యాగాలు చేసి స్వాతంత్ర్యమును సాధించారు. కాని, ఐకమత్యమును సాధించలేదు. ఐకమత్యం లేకపోతే స్వాతంత్ర్యమును సాధించి ప్రయోజనమేమిటి? ఈనాడు ఎక్కడ చూసినా ద్వేషాలే! ఒకే పార్టీలో పది పార్టీలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మనం ఏ రీతిగా సుఖాన్ని పొందగలం? మొట్టమొదట దేశాభిమానాన్ని కల్గియుండాలి. దేశక్షేమాన్ని లక్ష్యమునందుంచుకోవాలి. భారతదేశంలో ఉన్న పవిత్రత మరొక దేశంలో లేదు. అందువల్లనే భారతదేశంలో అనేక అవతారములు ఉద్భవించాయి. "భారతదేశమను బంగారు మనకుండ పర దేశములనున్న

sri sathyasai vahini vacanamrutam

మట్టి ఏల?" భారతదేశం అన్ని దేశాలకూ తల్లివంటిది. రాముడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నాడు. అనేకమంది రాముణ్ణి స్మరిస్తున్నారు గాని, రామవాక్యమును ఎంతమంది ఆచరిస్తున్నారు? స్మరించటంలో హీరోలు, ఆచరణలో జీరోలు!

**భక్తుల ఆనందమే నా ఆనందము**

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఈ దేహమునకు 75 వ పుట్టినరోజు అంటున్నారు. కాని, నాకు ఈ వయస్సుతో సంబంధం లేదు. నాకు ఎప్పుడూ ఈ పుట్టినరోజులు చేసుకోవాలనే ఆశలేదు. కాని భక్తులందరూ చేరటంచేత, కోరటంచేత ఈ పండుగను జరుపుకోవటానికి అంగీకరించాను. నాకు ఎలాంటి కోరికా లేదు. భక్తుల ఆనందమే నా ఆనందము. జగత్తుయొక్క క్షేమమే నాకు ప్రధానమైనది. కష్టజీవులను ఆదరించి వారి కష్టాలను తీర్చటమే నా ప్రధాన కర్తవ్యం. ఎవరు ఏ విధంగా చాటినప్పటికీ నా దీక్ష మారదు. మీరుకూడా ఇలాంటి దృఢమైన దీక్షను పూనాలి

పట్టిన దేదియో పట్టనే పట్టితివి
పట్టు నెగ్గెడు దాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితివి
కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితివి
అడిగిన దిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితివి
తలపు తీరెడు దాక తరలకుండు

పోరుపడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన అడగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగిపోవుట భక్తుని దీక్ష కాదు!

sri sathyasai vachanamrutam

## "నీవు నేను ఒక్కటే"

ప్రేమస్వరూపులారా! మీయందున్న ప్రేమ, నాయందున్న ప్రేమ రెండూ ఒక్కటే. కాని, మీ ప్రేమ వస్తువాహనాదులపట్ల భ్రాంతితో కలుషితమై యున్నది. నాకు వస్తువాహనాదులపై ఎట్టి వాంఛలూ లేవు. నాది Pure Love (పరిశుద్ధమైన ప్రేమ). మీయందున్న ప్రేమ వాంఛలతో చేరటంచేత కొంత నెగెటివ్‌గా మారుతున్నది. నెగెటివ్ అనేది నాలో ఎంత వెతికినా చిక్కదు. నాదంతా పాజిటివే. "నీవు నేను ఒక్కటే" అనేభావంతో ఈ పాజిటివ్‌ను మీ నెగెటివ్‌తో చేర్చుకోండి. అప్పుడు మీ జీవితంలో ఎంతైనా ఆనందమును అనుభవిస్తారు. ఎట్టి ఆనందము? "బ్రహ్మానందం, పరమసుఖదం.." అప్పుడు మీరే బ్రహ్మ స్వరూపులైపోతారు. మీరు ఏ సాధనలూ చేయనక్కర్లేదు. అయితే సాధనలు చేయాలని ఇష్టముంటే చేసుకోండి, తప్పులేదు. మీరు చేసే సాధనలన్నీ మనోతృప్తికోసమే చేస్తున్నారు, కాని ఆత్మతృప్తికోసం కాదు. అందరియందు ఏకత్వాన్ని దర్శించండి, అందరికీ ప్రేమతత్త్వాన్ని పంచిపెట్టండి. ఇదే నిజమైన సాధన.

## దేవుడు ఒక్కడే

ఏ పేరుతో పూజించినప్పటికీ దేవుడు ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించండి. "ఏక ప్రభు కే అనేక నామ్". మీరు సహస్ర నామార్చన చేసేటప్పుడు "కేశవాయనమః నారాయణాయనమః, మాధవాయనమః " అని ఒక్కొక్కతూరి ఒక్కొక్క పేరు చెప్పి – ఒక్కొక్క పేరుకు ఒక్కొక్క రూపముందా అక్కడ లేదే? ఒక్క రూపమునే ఇన్ని పేర్లతో పూజిస్తారు. అంతేకాదు. అంగపూజ చేసే సమయంలో "నేత్రం సమర్పయామి" అంటారు. కాని నిజంగా నేత్రాన్ని సమర్పిస్తున్నారా? లేదు. ఒక పుష్పంతో నేత్రాన్ని స్పృశించి ఆ పుష్పాన్ని సమర్పిస్తున్నారు. చెప్పేది నేత్రము, ఇచ్చేది పుష్పము! ఇలాంటి పూజలు చేయటం ఎంత దోషం! వీటిని భగవంతుడు కూడా అంగీకరించడు. దైవం ప్రసాదించిన ఈ అంగములు దైవానికి ఎందుకు? "భగవంతుడా! అంతా నీదే. ఈ దేహమే నీది. ఈ అంగములే నీవు. నేను నీవాడను, నీవు నా వాడవు" అని భావించినప్పుడు ఇంక ఈ పూజలు అక్కర్లేదు. అయితే అంతటి ఉన్నత స్థాయిలో లేనివారు జపం చేసుకోవచ్చు. ధ్యానం చేసుకోవచ్చు. చిన్న చిన్న పూజలు చేసుకోవచ్చు; తప్పు లేదు. అయితే మొట్టమొదట మీ దురభ్యాసములను, నెగెటివ్ భావాలను క్రమక్రమేణ నిర్మూలించుకోవాలి. పాజిటివ్ భావాలను అభివృద్ధి గావించుకోవాలి.



sri sathyasai vachanamrutam

## ఏది జరిగినా మీ మంచికే

ప్రేమస్వరూపులారా! మిమ్మల్ని దూషించిన వారిని తిరిగి దూషించడానికి పూనుకోవద్దు. వారు దూషించేది ఎవరిని? దేహాన్నే కదా! 'ఓ దుష్టుడా!' అంటే అది దేహానికి పెట్టిన పేరే. "ఈ దేహానికి నా తల్లిదండ్రులు ఒక పేరు పెట్టారు. నా మిత్రులు ఒక పేరు పెట్టారు. వీడొక పేరు పెడుతున్నాడు" అనే భావంతో పట్టించుకోకుండా ఉండాలి. ఎవరో మిమ్మల్ని 'దుష్టుడా!' అన్నంత మాత్రమున మీరు దుష్టులు కారు కదా! ఒక వేళ నిజంగా మీలో ఏవైనా దోషాలుంటే వాటిని నిర్మూలించుకోవటానికి ప్రయత్నించండి. మీరు ఎవ్వరినీ ద్వేషించకుండా సాధ్యమైనంతవరకు అందరినీ ప్రేమించండి. ఈనాడు లోకంలో ద్వేషము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణాలు అభివృద్ధి అవుతున్నాయి. వాటిని పోగొట్టటానికి ఒక్క ప్రేమతత్త్వం చాలు. మీ అభీష్టములు నెరవేరినా, నెరవేరకపోయినా, ఏది జరిగినా మీమంచికే అనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. మంచి, చెడ్డ రెండూ కలిసి ఉంటాయి. చెడ్డ లేకుండా మంచి రాదు, మంచి లేకుండా చెడ్డ జరగదు. కాబట్టి రెండింటిపట్ల సమత్వం వహించాలి. "సుఖ దుఃఖ సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ". రెండు బాధలమధ్య విరామమే సుఖము. కోరికలు ఎంత పెరుగుతాయో ఆనందము అంత తరుగుతుంది. కోరికలు ఎంత తరుగుతాయో ఆనందము అంత పెరుగుతుంది. కాబట్టి లౌకికమైన కోరికలను తగ్గించుకుని దైవం కావాలనే కోరికను పెంచుకుంటే ఎంతో హాయి కల్గుతుంది.

## "పత్రం, పుష్పం, ఫలం, తోయం..."

శ్రీకృష్ణతులాభార ఘట్టము గురించి మీకందరికీ తెలుసు. సత్యభామ స్వార్థంతో కృష్ణున్ని పూర్తిగా తనవాడిగా చేసుకోవాలని ఆశించింది. తన దగ్గర ఉన్న బంగారంతో కృష్ణుణ్ణి తూచటానికి ప్రయత్నించింది. శమంతకమణిని కూడా వేసింది. కాని కృష్ణుడు తూగలేదు. భగవంతుడు బంగారమునకు, ధనమునకు చిక్కుతాడా? అసాధ్యం. ఒక్క భక్తికి మాత్రమే చిక్కుతాడు, పవిత్రమైన గుణమునకు మాత్రమే చిక్కుతాడు. సత్యభామ పరుగెత్తుకుని వెళ్ళి రుక్మిణిని తీసుకువచ్చింది.

ఆ సమయంలో తులసీపూజ చేస్తున్న రుక్మిణిచేతిలో తులసీ దళాన్ని పట్టుకుని సత్యభామ వెంట వచ్చింది. నారదునిద్వారా జరిగిన సంగతి తెలుసుకుని "కృష్ణ రూపానికి కృష్ణుని

sri sathyasai vahini

నామమే సరియైన తూకము" అన్నది. దీనికి నారదుడు అభ్యంతరం తెల్పుతూ "అమ్మా! కృష్ణుడు సాకారంగా ఉన్నాడు; ఇప్పుడు నా స్వాధీనంలో ఉన్నాడు. అతనిని నీకివ్వాలంటే నీవు కూడా నాకు ఏదైనా ఒక సాకారమైన వస్తువు నివ్వాలి" అన్నాడు. అప్పుడు రుక్మిణి తన చేతిలో ఉన్న తులసీదళమును త్రాసులో వేసి "పత్రమో పుష్పమో తోయమో భక్తి కలిగినవానికి వశుడవగుట సత్యమేని కృష్ణా! నీవు ఈ తులసీ దళమునకు తూగుదువు గాక!" అన్నది. కృష్ణ రూపాన్ని కృష్ణనామము సరిగ్గా తూచింది. ఆ తులసీ దళమును కూడ వేసేటప్పటికీ కృష్ణుడు కూర్చున్నవైపు త్రాసు పైకి పోయింది. పత్రమంటే ఏమిటి? దేహమే పత్రము. హృదయమే పుష్పము. మనస్సే ఫలము. ఆనందబాష్పములే తోయము. భగవంతునికి అర్పించవలసినవి ఇవే.

ప్రేమస్వరూపులారా! ప్రేమను పెంచుకోండి. అప్పుడు మీ అభీష్టములన్నీ సిద్ధిస్తాయి. ఎవ్వరినీ ద్వేషించకండి ఇదే సరియైన ఆదర్శము. ఇదే ఈనాడు నేను మీకు అందించే ముఖ్యమైన సందేశము. మీరు ప్రేమస్వరూపులు కావాలి, ప్రేమహృదయులు కావాలి, ప్రేమమయులు కావాలి. ప్రేమానందమును అనుభవించాలి. ఇదే మీకు ఈనాడు ఇచ్చే గొప్ప బహుమతి. నా దగ్గర ఉన్నది ఈ ధనమే. ఈ భవనాలన్నీ నావి కావు. వీటిని భక్తులు కట్టించారు. భక్తులవే ఇవన్నీ. నా దగ్గర ఉన్న స్వంత ఆస్తి ప్రేమయే, ప్రేమయే, ప్రేమయే! ఆ ప్రేమను మీకు ఎంతైనా ఇస్తాను. కడపటికి దేహమైనా ఇస్తాను. మీరు ఆనందంగా జీవించండి, ఆదర్శవంతులుగా బ్రతకండి. అప్పుడే నాకు ఆనందం కల్గుతుంది. ఏది ఇచ్చినా నాకు ఆనందము కాదు, ప్రేమయే నాకు ఆనందము. నా ప్రేమయే మీకు సౌభాగ్యము. దానిని మీరు కాపాడుకోవాలని ఆశిస్తున్నాను.

(శ్రీవారు తమ అభయ హస్తాలనెత్తి ఆశీర్వదిస్తూ) అందరూ ఈనాడు శాశ్వతమైన భక్తిని, పవిత్రమైన జీవితాన్ని, దీర్ఘమైన జీవితాన్ని, సుఖమయమైన జీవితాన్ని పొందుదురు గాక! పొందుదురు గాక! పొందుదురు గాక! మీ కష్టములన్నీ పరిహారమగు గాక! మీరు కష్టములను గురించి యోచించకుండా, లభించిన సుఖాన్ని అనుభవిస్తూరండి.

**(23.11.2000 ఉదయం హిల్ వ్యూ స్టేడియంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

srisathyasaivachanamrutam